# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

APRIL - 2000

# సంక్షిప్త వార్తలు

2000 సంవత్సరము మార్చి నెల 3వ తేదీ శుక్రవారం నాడు శ్రీకాకుళం జిల్లా పలాస మండలం సందూరు గ్రామములో నిర్మించబడిన చక్కటి క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రభువు సేవకొరకు ప్రతిష్టించిరి. సందూరు గ్రామం అంతయు సవరా భాష మాట్లాడు కొండజాతి వారే. ప్రపంచమంతటిలోను సవరా భాష మాట్లాడు ఏకైక క్రీస్తుసంఘము సందూరులో యున్నది. ఈ సంఘమును 26 సంవత్సరముల క్రితము జాషువా గారు సవరాల మధ్య ప్రారంభించిరి. ఆలయ ప్రతిష్ట కార్యక్రమములో శ్రీకాకుళం నుండి ఆర్.సి.హెచ్. సద్గుణరావ్, బరంపురం (ఒరిస్సా) నుండి వై.తాతారావ్, మరియు పర్లాఖిమిడి(ఒరిస్సా) నుండి తిమోతి గార్లు పాల్గొని క్లుప్తముగా వాక్యము నందించిరి. కూటము అనంతరం 9మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సందూరులో సోదరులు సవరా సింహాద్రి గారును, మరికొంతమంది స్థానిక యౌవనస్థులు క్రీస్తు కొరకు మంచి పనిని చేయుచున్నారు. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులలో యున్న సవరా జాతివారికి సత్యసువార్తను అందించుటకు వారు చేయు కృషి శ్లాఘనీయమైనది.

మార్చి 10వ తేదీ శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా పండిత విల్లూరులో జరిగిన సువార్త కూటములో సోదరులు జాషువా గూటం గారు వాక్య పరిచర్య చేసిరి. స్థానిక సంఘ ఆలయ నిర్మాణమునకు పునాది వేసిరి. అనేకులు క్రైస్తవులు, క్రైస్తవేతరులు ఆసక్తితో వాక్యము వినిరి. పరిసర ప్రాంతముల సువార్తికులు ఆ కార్యక్రమములో పాల్గొనిరి. పండిత విల్లూరులో సోదరులు యమ్. ఇశ్రాయేలు గారు చాలా కాలమునుండి మంచి సువార్త పని చేయుచున్నారు.

మార్చి 14వ తేదీ మంగళవారం సాయంత్రం తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో క్రీస్తు సంఘ ఆలయ నిర్మాణము కొరకు సోదరులు జాషువా గూటం గారు పునాది వేసిరి. ఆ రోజు స్థానిక సంఘస్థులు, పరిసర ప్రాంతముల సువార్తికులు ఆ క్లుప్త కార్యక్రమములో పాల్గొనిరి. రాయవరంలో సోదరులు టి.నతానియేలు గారు సువార్త పని చేయుచున్నారు

మార్చి 15వ తేదీ బుధవారం సాయంత్రం కృష్ణాజిల్లా గన్నవరం మండలం, అల్లాపురం గ్రామంలో వేయబడిన క్రీస్తు సంఘ ప్రార్ధనశాలను జాషువా గారు ప్రార్ధన పూర్వకముగా ప్రారంభించిరి. తదుపరి వాక్యపరిచర్య

(తరువాయి 3వ కవరు పేజీలో)

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 20 ఏప్రియల్ 2000 సంచిక 9

## అన్ని సంఘాల్లోను క్రైస్తవులున్నారా ?
### ( Are Christians in all Churches ? )

అన్ని సంఘాల్లోను దేవుని బిడ్డలు, క్రైస్తవులు ఉన్నారని కొందరు చెబుతుంటారు. అయితే అదొక వింతయైన ధోరణి. ఏలయనగా బైబిలు ఎక్కడా అట్లు చెప్పుటలేదు. మనం బైబిలులో అనేక సంఘాలను గూర్చి గాక ఒకే ఒక్క సంఘమును గూర్చి చదువుతాము (మత్తయి 16:18). సరిగదా ఒకని ఒక సంఘముతో చేర్చునది వేరొక సంఘములో చేర్చదు. ఉదాహరణకు క్రీస్తు సంఘములో చేర్చబడే షరతుల ద్వారా ఒకడు మతశాఖలలో చేర్చబడడు. ఆలాగే మతశాఖలలో చేర్చ బడుటకున్న షరతులను బట్టి ఒకడు క్రీస్తు సంఘములో చేర్చబడడు. అట్లే వేర్వేరు మతశాఖల విషయంలో కూడ యిది సత్యమే. ఒక మతశాఖ సభ్యత్వపు షరతులను బట్టి ఒకడు వేరొక మతశాఖ సభ్యుడు కాజాలడు.

ఎవడైనా బాప్టిస్టు వారి షరతులకు లోబడి మెథడిస్టు సంఘ సభ్యుడవుతాడా ? ప్రతి (మతశాఖల) సంఘము దాని ప్రత్యేక షరతులను కలిగియున్నది.

క్రీస్తు సంఘ సభ్యులు విశ్వాసములో కుంటుబడి మతశాఖల సంఘములతో కలిస్తే తప్ప మతశాఖలలో క్రీస్తు సంఘస్థులుండరు. అంతేకాదు ఆయా మతశాఖల షరతులకు వారు లోబడి వెళ్తేనే వారు చేర్చుకోబడతారు. మతశాఖల సంఘాల షరతులకు లోబడి క్రీస్తు సంఘస్థుడై పోయినవాడు ఎవడులేడు. ఏదైనా ఒక వ్యాపారము చేయబోయి ఇంకో వ్యాపారంలో ప్రవేశించే వాడెవడులేడు. ఒక కళాశాలలో చేరడానికి అన్ని షరతులు పూరించి, వేరొక కళాశాలలో ప్రవేశము పొందేవాడెవడు లేడు. అదే రీతిగా ఒక రకమైన విత్తనము విత్తి ఇంకో రకమైన పంటను కాంక్షించేవాడెవడు యుండడు.

"వారందరు దేవుని చేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" అని క్రీస్తు చెప్పెను (యోహాను 6:45). దేవుని వలన బోధింపబడితేనే గాని ఎవడైనను రక్షింపబడుట యెట్లో, క్రీస్తు సంఘ సభ్యుడగుట యెట్లో ఏలాగు తెలిసికొనగలడు ? ఏదో ఒక దానిని విశ్వసించి, రక్షింపబడిపోయి, క్రీస్తు సంఘ సభ్యుడై పోగలిగితే దేవుని చిత్తమును వానికి బోధింపవలసిన ఆవశ్యకత యేమున్నది ?

దేవుని వాక్యమును వినుట వలన విశ్వాసము కలగును (రోమా 10:17). సత్యము మనలను స్వతంత్రులుగా చేయునని క్రీస్తు చెప్పెను (యోహాను 8:32). ఒకడు సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినప్పుడు రక్షింపబడును (మార్కు 16:16). ఒకడు రక్షింపబడినప్పుడు క్రీస్తు సంఘముతో చేర్చబడును (అపో.కా. 2:47). ఆతడు వేరే సంఘముతో చేర్చబడడు.

3.

"ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" యేసు చెప్పెను (యోహాను 3:5). యిది క్రొత్తజన్మ, దీని ద్వారా ఒకడు క్రీస్తులోను ఆయన సంఘములోను ప్రవేశించును. ఇక్కడ చెప్పబడిన నీరు బాప్తిస్మము. నీటిలో పాతిపెట్టబడుట, నీటిలోనుండి వెడలి వచ్చుట నూతన జన్మకు సాదృశ్యములు. దేవుని రాజ్యము సంఘమైయున్నది. మనము రోమా 6వ అధ్యాయము, గలతీ 3:26-27, మరియు 2కొరింథీ 5:17లను చూచిన యెడల, ఒకడు బాప్తిస్మపు నీటిలో పాతిపెట్టబడినప్పుడు అతని పాపములు క్షమించబడును, అతడు క్రీస్తులో ప్రవేశించును, దేవుని బిడ్డయగును, క్రీస్తులో నూతన సృష్టియగునని గమనించగలము. మరల అపొ.కా. 2:47లో రక్షింపబడిన వాడు సంఘముతో చేర్చబడునని చెప్పబడినది. గనుక యిదంతయు జరుగ వలెనంటే ఒకడు బోధింపబడాలి, దేవుని చిత్తాన్ని పఠించాలి, దానికి లోబడాలి.

రక్షింపబడాలంటే యేమి చేయాలో ఒకనికి తెలియకపోతే అతడెట్లు రక్షింపబడగలడు ? క్రీస్తు సంఘ సభ్యుడు కావాలంటే యేమి చేయాలో అతనికి తెలియకపోతే దాని సభ్యుడెట్లు కాగలడు ?

క్రొత్తనిబంధనలో అపొస్తలుల కార్యముల గ్రంథమును చదివిని యెడల సువార్త నిరంతరము బోధింపబడుట ద్వారా వినేవారు విశ్వసించి, ప్రభువుకు లోబడి సంఘముతో చేర్చబడుట నీవు కనుగొందువు. వున్నది ఒకే ఒక్క సంఘము గనుక వారా సంఘముతో ప్రభువుచే చేర్చబడ్డారు. మరియు రక్షణనొందిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెనని చదువగలము. సంఘము ఆయనదే. దానిలో చేర్చబడుటకు ఒకడు ఆయా షరతులకు లోబడెనో లేదో ఆయన ఎరుగును. ఆయన షరతులకు లోబడని వారు సంఘముతో చేర్చబడలేదు.

మతశాఖలలో యుంటున్నవారు రక్షింపబడిన వారేయని చెప్పుట ప్రమాద కరం. ప్రభువుది కాని సంఘములో యుంటూ తాను రక్షింపబడిన వానినే యని

ఎవరైనా ఎందుకు తలంచాలి ? అయితే ప్రభువును గూర్చి ఆయన సంఘమును గూర్చిన సత్యాన్ని తెలిసికొని ఆయన ఆజ్ఞలకు లోబడితే ఒకడు ప్రభువు సంఘసభ్యుడగును. నిజ క్రైస్తవుడగును !!

# సిలువ చుట్టూ ఏడు సంగతులు
## (Seven Things around the Cross)

1కొరింథీ 11:23-29 వచనాల్లో ప్రభురాత్రి భోజనమును గూర్చిన హెచ్చరికలను అపొ.పౌలు కొరింథులోని సంఘమునకు ఇచ్చియున్నాడు. రొట్టెను భుజించునప్పుడు, ద్రాక్షారసమును సేవించునప్పుడు యేసుప్రభువు యొక్క శరీరమును, రక్తమును మనం జ్ఞాపకము చేసికొనాలి. "నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని" ప్రభువే చెప్పెను. ప్రభురాత్రి భోజనములో పాలు పుచ్చుకొనేవారు పలుమారులు దానియొక్క ఆత్మీయ భావమును మరతురు. అదొక ఆచార కర్మగా దానిలో పాలుపొందుదురు. ప్రభురాత్రి భోజనంలో ప్రభువు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను మనం జ్ఞాపకం చేసికొనుటయే గాక, ఆయన తిరిగి వచ్చుచున్నారని కూడా ఈలోకానికి ప్రకటింతుము. గనుక ప్రభురాత్రి భోజన సమయములో మన మనస్సులు కల్వరి సిలువపై కేంద్రీకరించడానికి సహాయ కరంగా ఈ దిగువ సంగతులు గమనించుదాం :

**1. ఒకే ఒక్క ప్రభువు** : "ప్రభువు ఒక్కడే" (ఎఫెసీ 4:5). ప్రభువు అను పదము యాజమాన్యమును సూచించును. నిజంగా మనము విలువ పెట్టికొనబడిన వారము. "మీరు మీ సొత్తుకారు. విలువపెట్టి కొనబడిన వారు" (1కొరింథీ 6:20). "మనము ఆయన ప్రజలము. ఆయన మేపెడు గొర్రెలము" (కీర్తన 100:3). నేనే మార్గమును, సత్యమును, జీవమును అని యేసు చెప్పెను (యోహాను 14:6). ఆయన మరణం మనకు జీవమాయెను. ఆ ఒక్కడే ప్రభువు మనకొరకు సిలువపై బలియాయెను.

**2.** ఇద్దరు (రెండు) దొంగలు : "అతిక్రమము చేయువారిలో ఆయన ఎంచబడినవాడాయెను" అని యెషయా ప్రవచించెను (యెషయా 53:12). యేసు ప్రభువు యొక్క "కుడివైపున ఒకడును, ఎడమవైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ సిలువ వేయబడిరి" (మత్తయి 27:38). అపరాధము చేసిన వారికొరకు నిరపరాధి సిలువ వేయబడెను.

**3.** మూడు సిలువలు : కల్వరి మెట్టపై మనకు మూడు సిలువలు కన బడ్డాయి. ఒకటి ప్రతిఘటించే సిలువ. "వ్రేలాడవేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు-నీవు క్రీస్తువు గదా ? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుమని చెప్పెను" (లూకా 23:39). రెండవది పశ్చాత్తాప సిలువ. "అయితే రెండవవాడు వానిని గద్దించి-నీవు అదే శిక్షా విధిలోనున్నావు గనుక దేవునికి భయపడవా ? మనకైతే యిది న్యాయమే; మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని ఈయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి ఆయనను చూచి-యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను" (లూకా 23:40-42). మూడవది పరిహార సిలువ. మానవ పాపములకు పరిహారము చెల్లించుటకై యేసు సిలువపై తన రక్తమును చిందించెను, ప్రాణము ధారపోసెను. "మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీదపడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా 53:5). క్రీస్తు సిలువ విమోచ సిలువ. "క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తము చేత విమోచింపబడితిరని మీరెరుగరా ?" (1పేతురు 1:18-19).

**4.** నాలుగు భాగములైన వస్త్రములు : "సైనికులు యేసును సిలువ వేసిన తరువాత ఆయన వస్త్రములు తీసికొని, యొక్కొక్క సైనికునికి ఒక్కొక్క భాగము వచ్చునట్లు వాటిని నాలుగు భాగములు చేసిరి" (యోహాను 19:23). ఈ గొప్ప

సంఘటన యొక్క జ్ఞాపకార్థముగా ఆయన వస్త్రములు సైనికులు పంచుకొన్నారు గాని నిజానికి సిలువపై వ్రేలాడబడుచున్న ఆయనను మరచారు. మనమైతే ప్రభురాత్రి భోజనం ద్వారా ఆయనను జ్ఞాపకముంచుకొనాలి.

**5. ఐదు గాయములు :** వారాయనను సిలువకు మేకులతో కొట్టిరి. రెండు చేతులలోను రెండు కాళ్లలోను మేకులు కొట్టి ఆయనను సిలువ వేసిరి. "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కన పొడిచెను" (యోహాను 19:34).

**6. ఆరు గంటలు :** సిలువపై వ్రేలాడుచు ఆరు గంటల సేపు యేసుప్రభువు ఘోరమైన బాధననుభవించెను. ఆకాశమునకు భూమికి మధ్యను గొప్ప బాధననుభవించుచు దేవుని కుమారుడు సిలువపై వ్రేలాడెను. "ఆయనను సిలువ వేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను..... మధ్యాహ్నము మొదలుకొని మూడుగంటల వరకు ఆ దేశమంతట చీకటి కమ్మెను. మూడుగంటలకు యేసు ఏలోయీ, ఏలోయీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను; ఆ మాటలకు నాదేవా, నా దేవా నన్ను ఎందుకు చెయ్యి విడిచితివని అర్థము..... అంతట యేసు గొప్ప కేకవేసి ప్రాణము విడిచెను" (మార్కు 15:25-37).

**7. ఏడు మాటలు :** యేసుప్రభువు సిలువపై వ్రేలాడుచు ఏడు మాటలు పలికెను. ఆ ఏడు, గొప్ప పలుకులు, గొప్ప ప్రసంగములు. 1) ఆయనను సిలువ వేయుచున్న వారిని గూర్చి యేసు "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" ప్రార్థించెను (లూకా 23:34). 2) పశ్చాత్తాపమునొందిన దొంగతో "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను" (లూకా 23:43). 3) యేసు తాను ప్రేమించిన శిష్యుని చూపించి "అమ్మా, యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూచి "యిదిగో నీ తల్లి అని చెప్పెను" (యోహాను 19:26-27). 4)"నేను దప్పిగొనుచున్నాను" (యోహాను 19:28). 5) "నా దేవా, నా దేవా నన్నెందుకు

చెయ్యి విడిచితివి ?" (మత్తయి 27:46). 6) "సమస్తమును సమాప్తమైనది" (యోహాను 19:30). 7) "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" (లూకా 23:46) అని యేసు పలికెను.

ప్రభురాత్రి భోజనమును జరిగించునప్పుడు మనము మరింత భక్తిశ్రద్ధలతో దాని నాచరించాలి. అదొక గొప్ప స్మారక చిహ్నము. కల్వరి దృశ్యమును మన మనసులలో చిత్రీకరించుచు, మానవుని పతనమును, దేవుని ప్రేమను, ఆయన అనుగ్రహించిన విమోచనమును కృతజ్ఞతా పూర్వక హృదయంతో స్మరియించెదము గాక !

# నమ్మితే నమ్మండి !!
## (Believe it or Not !!)

చాల కాలమునుండి అంతు చిక్కకుండా పోయిన ఒక సంగతిని గూర్చి మీకు తెలియజేయడం ఈ వ్యాసము యొక్క ముఖ్య ఉద్దేశ్యము. బైబిలు యొక్క యదార్ధతను శంకించు శాస్త్రజ్ఞులకు, విజ్ఞానశాస్త్ర విద్యార్ధులకు యిది కనువిప్పు కలిగించే అంశము. ఈ విశ్వాన్ని సృజించిన వాడు దేవుడే యని, అది యింకా ఆయన చెప్పుచేతలలోనే యున్నదని తెలియజెప్పు ఒక గొప్ప సంఘటన దిగువ పొందుపర్చబడినది.

బైబిలులో కట్టుకధలా కనబడు ఒక సంఘటన అక్షరాల నిజమేనని అంతరిక్ష శాస్త్రజ్ఞులు ఈ మధ్యనే నిరూపించినట్లు నీకు తెలుసా ? అమెరికాలో మేరీలాండ్ రాష్ట్రములో బాల్టిమోర్ పట్టణంలో కర్టిస్ ఇంజనీరింగ్ కంపెనీ అధ్యక్షుడును, అమెరికా అంతరిక్ష కార్యక్రమములో సలహాదారుడునైన హెరాల్డ్ హిల్ గారు ఈ మధ్య సంభవించిన సంఘటనలను గూర్చి ఈలాగు చెప్పుచున్నారు :

"మేరీలాండ్ రాష్ట్రములో గ్రీన్‌బెల్ట్‌లో యున్న అంతరిక్ష శాస్త్రజ్ఞులకు దేవుడొక

గొప్ప వాస్తవమును చూపించారు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు వగయిరాలు నేటినుండి 100 లేక 1000 సంవత్సరముల తరువాత ఏయే స్థానములలో యుండునో యని వారు లెక్కలు కట్టుట మొదలుపెట్టారు. ఆయా గ్రహముల స్థానములను (Position) మనము తెలిసికోవాలి. ఏలయనగా వాటి (Position) స్థానములను తెలిసికోకుండా ఏదైనా ఉపగ్రహాన్ని అంతరిక్షంలోనికి పంపితే యిది వాటిని గుద్దుకొనే ప్రమాదమున్నది. అందువలన మన ఉపగ్రహాల ప్రమాణమును బట్టి వాటి కక్ష్యను నిర్ధారించి అవి రోదసీలో యున్న యితర గ్రహముల కక్ష్యలోనికి వెళ్లి వాటికి ఢీ కొట్టకుండా చూచుకోవాలి.

గనుక అంతరిక్ష శాస్త్రజ్ఞులు తమ కంప్యూటర్లను వందలాది సంవత్సరముల మట్టుకు వెనుకకు ముందుకు సాగించారు. అయితే ఆ కంప్యూటర్ ఒక చోట ఆగిపోయి రెడ్ సిగ్నల్‌ను పంపించసాగింది. అంటే ఆ కంప్యూటర్‌కి అందచేయబడిన సమాచారంలో గాని, అది అందించిన ఫలితములో గాని ఎక్కడో పొరబాటున్నట్లు దీని యర్థము. ఈ పొరబాటేమిటో యని తెలిసికొనుటకు వారు మరికొంతమంది కంప్యూటర్ ఇంజనీర్లను పిలిపించగా వారు వచ్చి గత కాలంలో అంతరక్షింలో ఎక్కడో ఒక రోజు కనబడకుండా పోయిందని తేల్చిచెప్పారు. అయితే ఎంత ప్రయత్నించినా బుర్ర గోక్కున్నారు, తబ్బిబ్బులై పోయారు. అయినను వారికి జవాబు దొరుకలేదు. అయితే వారిలో క్రైస్తవుడైన ఒకడు, చిన్నతనంలో సండేస్కూల్ లో సూర్యుడు నిలిచిపోయినట్లు బైబిలులో యున్నట్లు తాను నేర్చుకొన్నానన్నాడు. మిగతా శాస్త్రజ్ఞులు అతని మాటలు నమ్మకపోయినను, అదృశ్యమైన ఆ ఒక్క రోజును గూర్చి వారి దగ్గర జవాబు లేకపోయింది. అందువలన బైబిలులో అది ఎక్కడ వున్నదో వారికి చూపించమన్నారు.

అతడు బైబిలును తెరచి దేవుడైన యెహోవా యెహోషువతో చెప్పిన ఈ మాటలను యెహోషువ గ్రంథమునుండి చదివి వినిపించాడు : "అప్పుడు యెహోవా- వారికి భయపడకుము, నీ చేతికి వారిని అప్పగించుచున్నాను. వారిలో ఎవడును

నీ యెదుట నిలువడని యెహోషువతో సెలవిచ్చెను" (యెహోషువా 10:8). ఇశ్రాయేలీయులు తమ చుట్టుయున్న శత్రువులతో యుద్ధము చేయుచుండిరి. అయితే సూర్యుడస్తమించిన యెడల తమ శత్రువులు వారిని జయించే ప్రమాద మున్నది గనుక యెహోషువ ఆందోళన జెందెను. అందువలన సూర్యుడస్తమించ కుండునట్లు ఇశ్రాయేలీయులు వినుచుండగా యెహోషువ యెహోవాకు ప్రార్థన చేసెను. అప్పుడు సూర్యుడు నిలచెను. చంద్రుడు ఆగెను. "సూర్యుడు ఆకాశ మధ్యమున నిలిచి యించుమించు ఒకనాడెల్ల అస్తమింప త్వరపడలేదు" (యెహోషువ 10:12-14). అవును, అది నిజము !!

"అంతు చిక్కని ఆ ఒక దినము యిదుగో"! యని అంతరిక్ష యాత్రికులు, శాస్త్రజ్ఞులు పలికిరి. అప్పుడు వారు తమ కంప్యూటర్లను యెహోషువ కాలమునాటి వరకు వెనుకకు మళ్లించి పరిశోధింపగా అదృశ్యమైన ఆ దినము యొక్క సమయాన్ని కనుగొన్నారు, గాని ఆ సమయం 23 గంటల 20 నిమిషములు మాత్రమే యని వారు నిర్ధారించారు. అంటే అది పూర్తిగా ఒక్క రోజు కాదన్నమాట! వారు బైబిలును మరల చదవగా అది యించుమించు ఒకరోజు అని చెప్పుచున్నదని గమనించారు. బైబిలులో యించుమించు అను ఈ చిన్న మాట ప్రాముఖ్యమే. అయితే మిగతా 40 నిమిషాలు ఏమైనట్టు ? మరలా వారు గందరగోళములో పడ్డారు. వెయ్యి సంవత్సరముల తరువాత ఆ 40 నిమిషాలు పెద్ద సమస్యను తెచ్చిపెట్టగలవు. ఈ 40 నిమిషాలు వారు కనుగొనాలి . ఏలయనగా అంతరిక్ష కక్ష్యలో ఈ 40 నిమిషములు అనేక రెట్లు పెరిగిపోవచ్చు.

మరల ఆ క్రైస్తవ విజ్ఞానవేత్త, బైబిలులో సూర్యుడు వెనుకకు మళ్లినట్లున్నదని జ్ఞాపకం చేసుకొన్నాడు. మిగతా శాస్త్రజ్ఞులు అతడిని పిచ్చివాడన్నారు. అయినను బైబిలును తెరచి 2వ రాజులు గ్రంధములో వ్రాయబడిన సంగతిని చదివారు. రాజైన హిజ్కియా తన మరణశయ్య మీదనుండగా ప్రవక్తయగు యెషయా వచ్చి దేవుడతనికి మరి పదునైదు సంవత్సరముల ఆయుష్యము నిచ్చెనని తెలియజేసెను.

అందుకు హిజ్కియా ఒక సూచన నడిగెను. అందుకు యెషయా, తాను సెలవిచ్చిన మాట యెహోవా నెరవేర్చుననుటకు ఆయన దయచేసిన సూచన ఏదనగా, నీడ పదిమెట్లు (డిగ్రీలు) ముందుకు నడిచెను గదా ? అది పదిమెట్లు (డిగ్రీలు) వెనుకకు నడిచిన అవునా ? అందుకు హిజ్కియా యిట్లనెను- నీడ పదిమెట్లు (డిగ్రీలు) ముందరికి నడుచుట అల్పము గాని నీడ పది గడులు (డిగ్రీలు) వెనుకకు నడుచుట చాలును. ప్రవక్తయగు యెషయా యెహోవాను ప్రార్థింపగా ఆయన ఆహాజు గడియారపు పలక మీద పదిమెట్లు (డిగ్రీలు) ముందరికి నడిచిన నీడ పదిమెట్లు (డిగ్రీలు) వెనుకకు తిరిగి పోవునట్లు చేసెను" (2రాజులు 20:9-11).

పది డిగ్రీలు సరిగ్గా 40 నిమిషములు ! యెహోషువ గ్రంథములో 23 గంటల 20 నిమిషములు, 2 రాజులు గ్రంథములో 40 నిమిషములును కలిపితే ఈ విశ్వ చరిత్రలో అదృశ్యమైన ఆ ఒక్క దినము యొక్క లెక్క తేలినది !! యిది ఆశ్చర్యము కాదా ? విజ్ఞానశాస్త్రము వికసించే కొలదీ అది బైబిలు యదార్థమని నిరూపించుచున్నది. అందుకే "నేను నీ ధర్మ శాస్త్రమునందు ఆశ్చర్య కరమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము". "నీ వాక్యములువెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అవి తెలివిలేని వారికి తెలివి కలిగించును" అని దావీదు మహారాజు పలికాడు (కీర్తన 119:18,130).

- డేరన్ హెర్మన్

సంఘచరిత్ర :

# ప్రొటెస్టాంటుల సంస్కరణోద్యమము
## (The Protestant Reformatory Movement)

సత్యవాక్కు యొక్క గత సంచికలలో సంస్కరణోద్యమ సమయము వరకు కేథలిక్కు సంఘముయొక్క చరిత్రను తెలిసికొనియున్నాము. జాన్ విక్లిఫ్, జాన్‌హస్, సవనరోల మరియు టిండేల్ అను చారిత్రక పురుషులు కేథలిక్కుల భయంకర

ఆచారములను, బోధలను వ్యతిరేకించారు. కేథలిక్కుల దురాచారములపై వారు తిరుగుబాటు చేసినను, ఆ సంఘము యొక్క అధిక బలమునకు రౌద్రమునకు వారు బలి చేయబడిరి. వారి ఉద్యమము బలహీన పరచబడినది. కేథలిక్కు సంఘమునుండి సంపూర్తిగ విడుదల కావడానికి వారు చేసిన ప్రయత్నములు విఫలమైనను, హతసాక్షులై వారు పొందిన వీరోచిత మరణము ఐరోపా అంతటిలో 16వ శతాబ్దములో గొప్ప ప్రళయమునకు దారితీసెను. వారి ఉద్యమము వేగము పుంజుకొని అది ఆరంభించబడిన 50 సంవత్సరములలోనే (1520-1570) జర్మనీ, ఇంగ్లాండు, డెన్మార్క్కు, స్వీడన్, స్కాట్‌లాండ్, హాలేండ్ దేశములు పోపులకు దక్కకుండా పోయినవి. పోపుల అధికారమునకు స్పెయిన్, ఫ్రాన్స్ మరియు ఇటలీ దేశములలో కూడ బహిరంగ ప్రతిఘటన ఆరంభమాయెను. తిరిగి సంపాదించు కొనలేని రీతిగ కేథలిక్కు సంఘము తన ప్రాబల్యమును, సంఖ్యను, బలమును కోల్పోయెను.

సవరణోద్యమమును గూర్చి మరింత తెలిసికొనుటకు ఈ పాఠములో ప్రయత్నం చేయుదము. దానికి దారితీసిన కారణములు, ఆ ఉద్యమ నాయకులు, కేథలిక్కు సంఘము యొక్క స్పందన మరియు సవరణోద్యమ సూత్రములను పరిశీలింతము.

## దాని కారణములు

లేఖనములను గూర్చి భ్రష్టత్వ సంఘము యొక్క అభిప్రాయములు : లేఖనముల నెరుగక పోవుట వలన అనేక మార్పులు చేయబడెను :

- మత నాయకులు ప్రాబల్యము కొరకై ప్రాకులాడుట
- సర్వాధికారము సంఘముకే చెందుననే భావము వలన సంఘము ఎన్నటికి పొరబడనిదని, ఏ రకమైన తప్పులు చేయలేనిదని ప్రకటించబడెను. బైబిలు ప్రయోజన కారియని లేదా ప్రయోజనకారి కాదని ప్రకటించగల శక్తిని

సంఘము కలిగి యున్నదనే దురభిప్రాయమునకు యిది దారి తీసెను. అందువలన లేఖనములకు అతీతముగా సంఘము హెచ్చించబడెను. అట్టి స్థానమునది ఆక్రమించాలని దేవుడు ఎన్నడు కోరలేదు. లేఖనములకు సంఘము మాత్రమే భావార్థము చెప్పగలదని, మిగతా వారెవరు లేఖనములను అర్థము చేసికోలేరని ప్రచారము చేయబడెను.

- ఒకే ఒక్క వ్యక్తి సార్వజనిక సంఘములో అత్యున్నత స్థానమునలంకరించే లాగున చేయబడెను. మరియు అతడు ఎన్నడు పొరబడని వాడని ప్రకటించబడెను. తద్వారా సంఘమును తన అధీనములో యుంచుకొని పాలించెను.

- నాల్గవదిగా ప్రభుత్వము సంఘమునకు దాని శత్రువులనుండి భద్రత కల్పించవలెనను భావము ఆరంభమాయెను. సంఘము యొక్క వనరులను కూడ ప్రభుత్వమే సంరక్షించవలెనని కూడ తలంచబడెను. తత్ఫలితముగా సంఘ శత్రువులకు శిక్ష విధింపబడవలసి వచ్చెను. అందువలన సంఘ సభ్యులగుటకును, ఆరాధనలకు హాజరగుటకును ప్రభుత్వము ప్రజలను బలవంతము చేయగల్గెను. మరియు వారు దేనిని విశ్వసించాలో ప్రభుత్వమే ఆదేశించెను.

- ఐదవదిగా, పారంపర్యములు బైబిలుతో సమానమని భావించబడెను. 13వ శతాబ్దములో తోమస్ అక్వినాస్ అనువాని కృషితో పారంపర్యాచారములు గొప్పగా పైకెత్తబడెను. మరియు పోప్‌తో సమానముగా బైబిలుకు భావార్థము చెప్పుటలో పారంపర్యాచారములుపయోగింపబడెను.

## కేథలిక్కు సంఘములో అంతర్గత నైతిక పతనము

- సంఘ స్థానములను బహిరంగముగా వారు అమ్ముకొనేవారు. దీనినే Simony అంటారు.

- బంధుప్రీతి గొప్పగా ప్రబలియుండెను. అధికార స్థానములు, ప్రముఖ స్థావరములు మొదలగునవన్నీ బంధువులకే అప్పగింపబడుచుండెను.

- స్వాముల యొక్క అక్రమ జీవితములు, అక్రమ సంబంధములు, వారి అజ్ఞానము, అవినీతి మొదలగు వాటివలన సామాన్య ప్రజలు విసుగుచెంది యుండిరి.

- సంఘములో క్రమ శిక్షణ లేకుండెను. తమ నాయకులే పాటించని నియమములను ప్రజలెందుకు పాటించాలి ?

- యాజక ధర్మము (Clergy ) నిర్వర్తించువారు అజ్ఞానులు. మార్టిన్‌లూథర్ యొక్క సమకాలికుడైన కార్ల్స్‌డట్ తాను బైబిలు ప్రతిని దేనిని చూడక ముందే డాక్టర్ ఆఫ్ డివినిటి (D.D) బిరుదును పొందినట్లు చెప్పాడు (Miller, Page 26 ).

- పాపక్షమాపణ పత్రములు విక్రయించబడుటకే తయారు చేయబడెను. గనుక పాపము చేయుటకు గల అదృష్టము (Selling the Previlege to sin ) అమ్మబడుచుండెను. అది పోపుల యొక్క ధనాగారములోనికి వచ్చుచున్న ముఖ్య రాబడియాయెను. 1517లో జాన్ టెట్జెల్ (John Telzel). అనునతడు పోపుచే సంతకము చేయబడిన పాపక్షమాపణ పత్రములను అమ్ముచు జర్మనీ దేశము వచ్చెను. వాటిని కొన్నవారికి, వారి మిత్రులకు అన్ని రకములైన పాపములనుండి విడుదల నిచ్చుచు యివి అమ్మబడెను. మరియు వాటిని కొన్నవారు మారుమనస్సు పొందనక్కరలేదు, ప్రార్థన చేయవక్కరలేదు, ఎవరినీ క్షమాపణ నడుగనక్కర లేకుండగనే వారి పాపములు క్షమించబడేవి !! "ఈ పత్రములు కొన్నవారి డబ్బులు బొక్కసములో పడగానే, వారి మిత్రుల యొక్క ఆత్మలు పాతాళమునుండి పరలోకమునకు పైకెత్తబడునని" అతడు చెప్పెను. యిది మార్టిన్ లూథరును భయకంపితుని జేసెను ('Halley, Page 834).

- పరిశుద్ధుల ఆరాధన, ప్రతిమారాధన, మూఢాచారములతో కూడిన సంస్కారములు మొదలుగు వాటి వలన దేవుని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించే సూక్ష్మ విధానము కలుషితము చేయబడెను.

- సంఘములో బోధ అంతయు పాపక్షమాపణ పత్రముల విక్రయము, తీర్థయాత్రలు, పండుగలు, ధనార్జన మొదలగు వాటిపైనే కేంద్రీకరించ బడెను. దేవుని వాక్యము పూర్తిగ విసర్జించబడెను. "అది ప్రసంగ వేదికకు గొలుసులతో బంధింపబడెను" ("It had been chained to the Pulpit")- (Miller, Page 27 ).

- క్రొత్తనిబంధన సత్కార్యములను గూర్చి చెబుతుంటే, పుణ్య కార్యముల ద్వారా మోక్షము సాధ్యమనే భావము వ్యాపింప చేయబడెను. అది స్వార్థపరుల నైజమునకు యింపుగా యుండెను.

- "ధర్మవిచారణ" (Inquisition) సందర్భములో పోపుయొక్క క్రూరత్వము బయలుపరచ బడెను-ధర్మ విచారణను పవిత్ర స్థానము అని పోప్ ఇన్నోసెంట్ III పిలిచెను. మత దూషకులను (heretics ) పట్టుకొనుటకు శిక్షించుటకు ఏర్పరచబడిన సంఘ న్యాయసభ యని అది పిలువబడెను. అది పనిచేయు విధానమును Halley యిట్లు వివరించెను: "దీనిని బట్టి అందరు మత దూషకులను గూర్చి తెలియజేయాలి. ఎవడైనను అనుమానించబడితే అతనిమీద నిందమోపిన వాడెవడో తెలియజేయ కుండగనే హింసించబడెను. ఆ కార్యక్రమం అంతా రహస్యముగా జరిగెను."ధర్మవిచారణ" వారు శిక్ష విధించేవారు. శిక్ష విధించబడిన వాడు కాల్చివేయబడుటకో లేక చెరసాలలో వేయబడుటకో ప్రభుత్వాధికారులకు అప్పగింపబడేవాడు. మరియు అతని ఆస్థిపాస్థులను సంఘము, ప్రభుత్వము పంచుకొనేవారు" (Halley, Page 883 ).

పోప్ ఇన్నోసెంట్ III యొక్క పాలన తరువాత ఐరోపా అంతటిలోను కేథలిక్కు

సంఘము తిరుగుబాటు దారులను ఈ "ధర్మవిచారణ" ద్వారా పూర్తిగా అణచివేసెను. తరువాత సంస్కరణోద్యమమును అణగద్రొక్కుటకు పోపులు దానినే వినియోగించిరి. వేలకొలది ప్రజలు ఈ విచారణలో నశించిరి.

## యితర కారణములు

- ప్రభుత్వము, సంఘము మిళితము చేయబడుటను గూర్చి అనేకులు అభ్యంతరము తెలియజేసిరి. మతము రాజకీయము చేయబడుట వలన అనేకులలో అసంతృప్తి బయలుదేరెను.
- అధికారము సంఘమునకు గాక బైబిలుకు చెందాలని అనేకమంది విద్యావేత్తలు తలంచిరి. ఆత్మీయాధికారము సంఘములో గాక బైబిలులో యున్నదని సంస్కరణ కర్తలు భావించుటలో వ్యక్తిగత స్వేచ్ఛా హక్కును ఉపయోగించిరి.
- మధ్య యుగ సంబంధమైన నాగరికత నుండి ఆధునిక యుగములోనికి ప్రవేశించుచున్న యూరపు అంతటిలోను ఈ పునరుద్ధరణ గొప్ప ఉత్తేజమును కలిగించెను. కళలలోను, సాహిత్యములోను, విజ్ఞాన శాస్త్రము లోను ప్రజలకు గొప్ప ఆసక్తి రేకెత్తించబడెను. వారి పురాతన తలంపులు ఆధునికములాయెను. గతంలో యున్న అజ్ఞానము, మూఢనమ్మకములు పోయి, జ్ఞానాభ్యాసము కొరకు ప్రజల ఆసక్తి వికసించెను. తత్ఫలితముగా విజ్ఞానము విస్తరించే కొలదీ మతసంబంధ పరిస్థితులను గూర్చిన అసంతృప్తి పెచ్చుపెరిగెను (Cox, Page 53).
- 1455వ సంవత్సరములో గూటెన్ బర్గ్ కనిపెట్టిన అచ్చుయంత్రము మరొక గొప్ప కారణమాయెను. "యిది కనిపెట్టబడకముందు కాలారంభము నుండియు కూడ గ్రంధములు చేతితో ఎంత త్వరగా కాపీ చేయబడితే అంత త్వరగా వ్యాపించబడుచుండెను. ఒకని సంవత్సరాదాయము

నంతయు హెచ్చించితే బైబిలు యొక్క ప్రతి ఒకటి ఆ రోజుల్లో లభించేది. నిజానికి గూటెన్ బర్గ్ అచ్చుయంత్రము వలన బైబిలు గ్రంధము త్వరితముగా ప్రజల కందజేయబడెను. అది యూరపులోని భాషలన్నిటికీ తర్జుమా చేయబడి, ముద్రించబడి సరఫరా చేయబడెను. క్రొత్తనిబంధనను చదివిన ప్రజలు పోపుయొక్క సంఘమునకు క్రొత్త నిబంధన సంఘమునకు గొప్ప వ్యత్యాసమున్నదని యిట్టే తెలిసికొనగలిగిరి" (Hurbut, Page 151).

- జాతీయత, దేశభక్తి మొదలగు భావములు ప్రజల యొక్క ఆలోచనా సరళిలో మార్పులు కలుగజేసెను. వారి జాతీయ సంఘములపై ఒక విదేశీశక్తి అధికారము చెలాయించుచున్నందున ప్రజలు ఆగ్రహము కలిగియుండిరి. విదేశములో యున్న ఒక పోపు తమ స్వదేశ సంఘములో అధికారులను ఏర్పరచుటను వారు ప్రతిఘటించిరి (Cox, Page 54).

వీటిని బట్టియు, ఇట్టి అనేక కారణములను బట్టియు సంస్కరణోద్యమ జ్వాలలు త్వరగా వ్యాపించెను. తమ ప్రభావమును చూపగల నాయకులు వెలుగులోనికి వచ్చిరి.

## సంస్కరణోద్యమ నాయకులు

### మార్టిన్ లూథర్ (1483-1546) :

లూథర్ కేథలిక్కు కుటుంబములో జన్మించి, కేథలిక్కు గానే జర్మనీలో పెరిగెను. అతడొక కేథలిక్కు స్వామియై బైబిలును నేర్చుకొనెను. అతడు ఎర్ఫర్ట్ యూనివర్సిటిలో పట్ట భద్రుడై, విటెన్ బర్గ్ యూనివర్సిటీ నుండి వేదాంత విద్యలో డాక్టరేట్ బిరుదును పొందెను. అతడు విటెన్‌బర్గ్‌లో 1508నుండి తాను మరణించిన 1546వ సంవత్సరము వరకు ఉపాధ్యాయునిగ పనిచేసెను. తాను బైబిలును చదువుటను బట్టియు, నాడున్న కేథలిక్కుల ఆచారములను బట్టియు ఈ దిగువనుదహరించిన అంశములను అతడు వ్యతిరేకించెను.

- అతడు పోపుల అధికారమును సవాలు చేసెను
- సంస్కార (Sacramental) పద్ధతిని ఖండించెను.
- యాజకులే (స్వాములే) పరిశుద్ధులనుటను వ్యతిరేకించెను.
- ప్రజలు రోమా యొక్క బానిసత్వమును విసర్జించి, సంఘము యొక్క ఆక్రమణలో యున్న భూములను, ధనమును స్వాధీనము చేసికొనవలెనని ప్రోత్సహించెను.
- రొట్టె ద్రాక్షారసములు క్రీస్తు శరీర, రక్తములుగా మారునను సిద్ధాంతమును ఖండించెను.

అయితే 1517లో టెట్జల్ అనునతడు పాపక్షమాపణ పత్రములను విక్రయించుచు జర్మనీ వచ్చెను. పోప్‌లియో X అనుసతడు రోమా పట్టణములో నిర్మించుచున్న సెయింట్ పీటర్స్ కెతిడ్రల్‌ను పూర్తి చేయుటకు అతడు ఈ పత్రములను విక్రయించుచుండెను. (ఆ ఆలయమంతయు ఇంచుమించు ఈ పత్రముల విక్రయము వలన వచ్చిన సొమ్ముతో నిర్మించబడెను). ఈ స్కీమ్‌ను మార్టిన్ లూథర్ తీవ్రముగా వ్యతిరేకించుచు, 1517వ సంవత్సరము అక్టోబరు 31వ తేదీన తన 95 అంశముల నిరసన పత్రమును జర్మనీలో విటన్ బర్గ్ సంఘ ఆలయమునకు మేకులతో కొట్టెను. "ధనార్జన కొరకు పన్నిన ఈ వలను" అతడు తీవ్రముగా వ్యతిరేకించెను. అతని చర్యలకు అనుకూలముగాను, ప్రతికూలము గాను ప్రతిస్పందన రాగా లేఖనములే సర్వాధికారములనే నిర్ణయమును గైకొని, తనకు వ్యతిరేకముగా యున్న మానవాధికారములను ధిక్కరించెను.

1520వ సంవత్సరం జూన్ 15వ తేదీనాడు పోప్‌లియో X ఒక ఆజ్ఞను జారీ చేస్తూ లూథరు తన వ్యతిరేకతను విరమించుకొనుటకు రెండు నెలల సమయమునిచ్చెను. లేదా అతడు మత దూషకుని శిక్షను (మరణ శిక్షను) అనుభవింపవలసి వచ్చును అని హెచ్చరించెను. ఆయాజ్ఞను అతడు నిరసిస్తూ దానిని ఆ సంవత్సరం డిశంబరు

నెలలో బహిరంగముగా తగులబెట్టెను. కేథలిక్కు సంఘముతో తనకు గల సంబంధమును ఈవిధముగా త్రెంచివేసెను. లూధరును కేథలిక్కు సంఘము నుండి బహిష్కరించుచు 1521 జనవరి 3వ తేదీనాడు పోపు మరియొక ఆజ్ఞను జారీచేసెను.

అతడు వోర్మ్స్ చట్టసభ (Diet of Worms ) యెదుట హాజరు కావలసినదని "పరిశుద్ధ రోమా చక్రవర్తి" యగు చార్ల్స్ V చే ఆజ్ఞాపింపబడెను. తాను చెప్పిన దానిని నిరాకరించవలెనని అతనికి ఆజ్ఞాపింపబడెను. అందుకు అతడు తిరస్కరించగా మార్టిన్ లూధర్ మత దూషకుడని ప్రకటింపబడెను. అతనికి మరణశిక్ష విధింపబడెను. అయితే తీర్పు జరిగిన స్థలమునుండి తన గృహమునకు వెళ్లు మార్గములో అనేకులైన తన మిత్రులు అతని రక్షించి మరణమునుండి తప్పించిరి. చట్టసభ యెదుట నిలబడి, "నేను చూపించిన లేఖన భాగములను బట్టి నేను అంతరాత్మలో ప్రేరేపింపబడిన వాడను. గనుక నేను చెప్పిన దానిని నిరాకరించను, నిరాకరించలేను" అని అతడు ధైర్యముగా వాదించెను. అతడు 1546లో మరణించెను. అతడు మొదటి ప్రొటెస్టాంటు డినామినేషన్ యొక్క స్థాపకుడు. ఆ డినామినేషన్ లూధరు పేరునే ధరించి యుండును.

## ఆల్‌రిచ్ జ్వింగ్లీ (1484-1531) :

మార్టిన్ లూధర్ యొక్క సంస్కరణోద్యమము జర్మనీ దేశమును చదును చేయుచుండగా జ్వింగ్లీ స్విట్జర్లాండ్‌లో దానికి నాయకత్వము వహించెను. లూధర్ వలెనే అతడు గొప్ప విద్యావంతుడు, ధైర్యశాలి. దిగువనుదహరించిన అంశములపై అతడు కేథలిక్కుసంఘమునుండి తెగత్రెంపులు చేసుకొనెను.

- సంఘము, ప్రభుత్వముల మిశ్రమమును అతడు వ్యతిరేకించెను.
- పాపక్షమాపణ పత్రముల విక్రయమును ఖండించెను.
- పాదిరుల సన్యాసత్వమును వ్యతిరేకించెను.

- దివ్య బలిపూజ (Mass) ను వ్యతిరేకించెను.
- ప్రతిమార్చనను ఖండించెను.
- బైబిలే సర్వాధికారియని ప్రకటించెను.
- ఆరాధనలో వాద్య సంగీతమును ఖండించెను.

స్విట్జర్లాండ్‌లో కేథలిక్కు సంఘమును ఇంచుమించు అతడు సమూలముగా నాశనము చేసెను. నాటినుండి నేటివరకు అది ఆ దేశములో బలహీనముగనే యున్నది. లూథరు యొక్క జర్మనీలో కంటే జ్వింగ్లీ యొక్క సంస్కరణ ఉద్యమము స్విట్జర్లాండ్‌లో బహుగా వ్యాపించెను. లేఖనములను గూర్చిన అతని అభిప్రాయములు లూథరు కంటె బలమైనవిగా యుండెను. లేఖనములే సర్వ సంపూర్ణములని అతడు బోధించెను, భావించెను. అట్లు చేయుటలో బాహ్యముగా గోచరములగు ప్రతిమలు, అవశేషములు, వాద్యములు మొదలగు వాటిని ఆరాధన నుండి తొలగించెను. స్వాముల మఠములను (Monastries ) ఎత్తివేసెను. ప్రభురాత్రి భోజనములో రొట్టె, ద్రాక్షారసములు క్రీస్తు శరీర, రక్తములుగా మారునను సిద్ధాంతమును తుడిచివేసెను. బైబిలు ఖచ్చితముగా దేనిని ఆమోదించుచున్నదో దానినే ఆరాధనలో అమలు పర్చాలని అతడు విశదీకరించెను. 1529లో తాను, లూథరు కలసికొనినప్పుడు ప్రభురాత్రి భోజనమును గూర్చిన తమ యభిప్రాయము లలో ఏకీభవించలేక పోయిరి. రొట్టె ద్రాక్షారసములు క్రీస్తు యొక్క నిజ రక్త మాంసములు కాకపోయినను, అవి ఏదో విధంగా అట్లు మారునని లూథరు ఒక రకమైన విచిత్ర భావమును కలిగి యుండెను (Luther did not believe in transubstantiation, but believed in consubstantiation ). జ్వింగ్లీ తనతో ఏకీభవించ నందున లూథరు ఆగ్రహముతో అతని నుండి వెడలిపోయెను.

ప్రొటెస్టాంటు సైన్యములు, కేథలిక్కు సైన్యములు యుద్ధమునకు దిగుట వలన ఈ గొప్ప మనుష్యుని జీవితం సంకుచితం చేయబడెను. కేథలిక్కు

సిపాయిలకు లొంగిపోవుట కంటే మరణించుటయే మేలని జ్వింగ్లీ తలంచెను. అతడు చంపబడెను.

## జాన్ కేల్విన్ (1509-1564) :

ఇతడు ఫ్రాన్స్ దేశస్థుడు. విద్యావేత్త. అయినను ప్రొటెస్టాంటు ఉద్యమమును గూర్చిన సానుభూతి గలవాడు. అందువలన రోమన్ కేథలిక్కు సంఘము వలన తన స్వదేశమునుండి బయటికి తరిమివేయబడినవాడు. ఆ రోజులలో ప్రొటెస్టాంటు వారందరు కొయ్యకు కట్టి కాల్చి వేయబడుచుండేవారు. అతడు స్విట్జర్లాండ్ వెళ్లి జ్వింగ్లీతో కలసి సంస్కరణోద్యమమును కొనసాగించెను. బ్రదికినంత కాలము అనారోగ్యముతో యుండినను అతని జీవితం క్రైస్తవ జీవితానికి ఒక గొప్ప ఆదర్శవంతమైనదని తన జీవిత చరిత్రను వ్రాసిన గ్రంధకర్త పలికెను. తన 27వ సంవత్సరములోనే సంస్కరణ వేదాంతమును వర్ణించుచు తన ప్రఖ్యాతిగాంచిన "సంస్థలు" (Institutes) అనుదానిని వ్రాసెను. మన రక్షణను గూర్చిన సమస్తము దేవుని చిత్తముపై ఆధారపడియున్నదని కేల్విన్ వక్కాణించెను. మనలను మనమే కాదు గాని దేవుడొక్కడే రక్షించును అని అతడు ప్రకటించెను. అతని విశ్వాసమును బట్టి 5 ప్రముఖ సిద్ధాంతములు ప్రబలెను. అతని 5 సిద్ధాంతములు ప్రెస్బిటేరియన్ సంఘము యొక్క మూల సూత్రములు. అతడా డినామినేషన్‌కు మూలకర్త. ఈ ఐదు సిద్ధాంతములు ఏమనగా :

- ఎన్నిక, ముందు నిర్ణయము (Election, Predestination). కొందరు రక్షింప బడుటకు, మరికొందరు శిక్షింపబడుటకు ముందుగానే ఎన్నిక చేయబడ్డారు.
- పరిమితమైన విమోచన-యేసు ముందుగా నిర్ణయింపబడిన వారి కొరకే మరణించెను.
- పారంపర్య సమగ్ర భ్రష్టత్వము, అనగా అందరు వారసత్వము వలన పాపులు గానే జన్మింతురు.

- ప్రభావ పూరితమైన పరిశుద్ధాత్మ పిలుపు. అనగా రక్షించుటకు ఎంచుకొనిన వారిని దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా పిలుచును. మానవుడు దానిని ఎదురాడజాలడు.

- భ్రష్టత్వము అసాధ్యము, అంటే రక్షింపబడిన వాడెన్నడు నశించిపోడు.

జాన్‌కేల్విన్ ఈ దిగువ సంగతులను కూడ విశ్వసించెను, పాటించెను :

- సంఘ పాలన కొరకు స్థానిక సంఘస్థులే సంఘ అధికారులను ఎన్నుకొన వలెను.

- ఆత్మీయ సంగతులలో సంఘము, ప్రభుత్వము ఒకరి పనులలో ఒకరు జోక్యము చేసికొన కూడదు.

- స్థానిక సంఘారాధనలలో వాద్యములు లేకుండా పాటలు పాడాలి.

- లేఖనములే సర్వ సంపూర్ణములు.

సంస్కరణోద్యమము యొక్క మహా పురుషుడు జాన్ కేల్విన్ అని అనేకులైన విద్యావేత్తలు చెప్పుదురు.

## ఫిలిప్ మెలాంగ్‌తన్ (1497-1560) :

ఇతడు వినయ విధేయతలు గల విద్యావేత్త. గొప్ప పండితుడు. మార్టిన్ లూధరుకు సన్నిహిత మిత్రుడు, సహ సంస్కరణ కర్త. వేర్వేరు స్వభావములు గలవారైనను వీరిద్దరు మిత్రులై యుండుట ఆశ్చర్యము. లూధరు లేకుండా సంస్కరణ ఉద్యమము ప్రజలలో ప్రబలి యుండేది కాదు. అయితే మెలాంగ్‌తన్ లేకుండా అది జర్మనీలోని విద్యావేత్తలను జయించేది కాదు అని తరుచు చెప్పబడుచుండేది. ప్రొటెస్టాంటుల మొదటి విశ్వాస ప్రమాణమును లిఖించినవాడు ఫిలిప్ మెలాంగ్‌తన్. దానినే Augsburg Confession of Faith అంటారు. అది క్రీ॥శ॥ 1530లో లిఖించబడెను.

జాన్ నాక్స్ (1505-1572) :

యితడు మొదట్లో కేథలిక్కువాడే. జాన్ కేల్విన్ యొక్క సిద్ధాంతములను స్కాట్‌లాండ్ తీసికొని వెళ్లి అక్కడ ప్రెస్బిటేరియన్ డినామినేషన్ స్థాపించెను. కేల్విన్ వలె యితడును వ్యాధిగ్రస్థుడే, బలహీనుడే. అయితే గొప్ప ధైర్యశాలియైన బోధకుడు. అతని యొక్క కృషి, పలుకుబడి వలననే స్కాట్‌లాండ్ పార్లమెంటు కేథలిక్కుల బోధను, ఆరాధన పద్ధతిని ఆ దేశమునుండి 1560లో తరిమి వేసెను. మరియు ప్రొటెస్టాంటుల మతమును ఆ దేశ మతముగా ప్రకటించెను.

వచ్చే సంచికలో సవరణోద్యమమునకు కేథలిక్కులు ఎట్లు స్పందించారో తెలిసికొందము.

## ఆరాధన
(Worship)

ప్రపంచములో వివిధ మతాలకు చెందిన ప్రజలు వివిధ రకాల దేవుండ్లను విభిన్న రకాలుగా ఆరాధిస్తుంటారు. ఆరాధన అనగా సృష్టికర్తను భక్తి పూర్వకముగా పూజించి, ప్రేమతో గౌరవించుట. దైవ మానవాత్మల కలయికయే ఆరాధన. మీ ఆరాధనను గురించి మీరు ఎప్పుడైన తలంచితిరా ?

సర్వశక్తి గల దేవుడే పూజ్యనీయుడు. అనేక మంది తలంచునట్లుగా మనకు అనేకమంది దేవుళ్ళు లేరు కాని ఒకే ఒక్కడున్నాడు : "ఆకాశమందైనను భూమి మీదనైనను దేవతలనబడినవి యున్నను మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి; ఆయన నుండి సమస్తము కలిగెను; ఆయన నిమిత్తము మన మున్నాము." (1కొరింథీ 3:6-8). మొట్టమొదట మనుష్యులందరు ఒకే దేవుని ఆరాధించిరి, పిదప వారు వేరు వేరుగా చీలిపోయిరి.

"దివ్యతి ఇతిదేవ": అనగా ప్రకాశించుచున్నవాడే దేవుడు! ఈ సత్య ప్రకాశమైన పరిశుద్ధ వెలుగు క్రీస్తే (యోహాను 8:12). క్రీస్తులో పాపము లేదని ఖురాన్‌లో వ్రాయబడెను (19సురా 17:19). యేసుక్రీస్తు పాపంలేని దైవమానవుడు (యోహాను 8:46). దైవత్వం యొక్క సర్వ పరిపూర్ణత శరీరాకారముగా క్రీస్తు నందు నివసించుచున్నది (కొలస్స 2:9). పరిశుద్ధుడే పూజార్హుడని సర్వమత గ్రంధాల సారాంశము. ఆ పరిశుద్ధుడు యేసుక్రీస్తే!

"యోతతి వ్యాప్నో తేసా ఆత్మ" అనగా ఆయన భూమ్యాకాశములయందు అంతట వ్యాపించిన ఆత్మ! ఆయన "సర్వాంతర్యామి"-అంతట వుండువాడు. నిత్యము ఉన్నవాడు (యిర్మియా 23:23,24). "ఈసారుహుల్ల" "కలిమ తుల్లాహి" అనగా క్రీస్తుదేవుని ఆత్మ మరియు దైవవాక్యము (శబ్దం) అని ఖురాన్ విశద పరచుచున్నది (ఇమ్రాన్ 3 సురా7, కాండము 3, ఇమ్రాన్ 45-47). క్రీస్తు సృష్టికర్తయైన శబ్ద బ్రహ్మము. ఆయన మూలముగా సమస్తము కలిగెను. (యోహాను 1:1-3). జగత్తును అందలి సమస్తమును నిర్మించి పాలించుచున్న దేవుడు క్రీస్తే (అపొ.కా. 17:24). ఈ క్రీస్తు మనుజుల పాప పరిహారార్థమై శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా భూలోకమందు సుమారు 2000 సంవత్సరాల క్రితము జీవించి పాపుల రక్షణార్థమై సిలువలో యజ్ఞమై తిరిగి లేచెను (యోహాను 1:14, హెబ్రీ 10:12, 1తిమో 2:6). "క్రీస్తు సర్వాధికారియైన దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు ఆమెన్" (రోమా 9:5).

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను". (యోహాను 4:24). ఆత్మజ్ఞానము కలిగి, నిష్కపటముగా పూర్ణాత్మతో జీవముగల దేవుని పూజించవలెను. విశ్వమంతట వ్యాపించిన పరమాత్ముడైన క్రీస్తును హృదయ పూర్వకముగా ఆరాధించుచుంటివా?

క్రీస్తును దేవునిగా గుర్తించి ఆరాధించు విషయంలో అనేకులు వెనుకబడి

యున్నారు. సమాజంలోని కొందరు మనుష్యులు సృష్టికర్తకు చెందవలసిన ఆరాధనను ఆయనకు చెందకుండా కలుషిత పరచుటను మీరు గమనించి యుందురు. కాలక్రమేణా మనుష్యులు విస్తరించినట్లే క్రొత్త దేవుళ్ళు పుట్టడం ఒక విచిత్రం ! కొందరు తమకు తోచిన వాటినే దేవుడిగా సేవిస్తే, మరికొందరు ధనాపేక్షకు లోబడి క్రొత్త దేవుళ్ళను పుట్టించి ప్రజలలో ఆరాధన గూర్చిన సరైన అవగాహన లేకుండా చేస్తున్నారు. వారు "అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పురుగుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి". అట్టివారు "దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు ఆమేన్" (రోమా 1:23-25). ప్రియుడా నీ ఆరాధన క్రీస్తుకేనా ? వ్యక్తి సేవలు, సృష్టి పూజలు, విగ్రహారాధనలు వ్యర్ధము !

ప్రియ చదువరి ! సమస్త దేవతలకంటెను యేసుక్రీస్తు పూజ్యనీయుడు (కీర్తనలు 96:4). అనర్హుడైన వారిని పూజించినచో శాపము వచ్చును. గనుక రండి ! మనలను సృజించిన సృష్టికర్తయైన క్రీస్తుకే నమస్కారము చేసి సాగిలపడుదము. సర్వమెరిగిన సర్వశక్తిగల ప్రజాపతి మృత్యుంజయుడై త్రికాలంలో నున్న క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొంది ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధించి ఆశీర్వాదములు పొందుదము! శక పురుషుడయిన క్రీస్తుకే సదా మహిమలు కలుగును గాక ఆమేన్ !

- సి.హెచ్. మురళీకృష్ణ
క్రీస్తుసంఘము, క్రొత్తగూడెం.

చేసిరి. సోదరులు పి.షద్రక్ (గన్నవరం), పి.అబ్రాహాము (ముత్యాలపాడు, విజయవాడ) మొదలగువారు ఆ కార్యక్రమములో పాలుపంచుకొనిరి. అల్లాపురం గ్రామములో సోదరులు టి. ఇమ్మానుయేలు గారు వాక్య పరిచర్య చేయుచున్నారు.

మార్చి 16వ తేదీ గురువారం విజయవాడ ముత్యాలపాడు క్రీస్తుసంఘ ఆధ్వర్యములో కృష్ణా జిల్లా సువార్తికుల సదస్సు జరిగెను. కృష్ణా, గుంటూరు, ఖమ్మం జిల్లాలనుండి సువార్తికులు వచ్చి ఆ సదస్సులో పాల్గొనిరి. సోదరులు జి.మార్కు (నందిగామ) గారు అధ్యక్షత వహించగా, కె.ఫిలేమోను, కె.బాబురావ్ గార్లు ప్రార్థనలు చేసిరి. సోదరులు ఫిలేమోను, సాలొమోను, ప్రకాశ్ గార్లు పాటలు నడిపించిరి. "యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముటకు గల కారణములేమి?" అను అంశమును సోదరులు సవిస్తరముగా చర్చించిరి. సదస్సులో మొదట సోదరులు జి.జాన్సన్ (తెనాలి) వాక్యోపదేశం చేసిరి. క్రీస్తునందలి సహోదరుల మధ్య ఐక్యత యొక్క ప్రాముఖ్యతను వక్కాణించిరి. మరియు సి.హెచ్. కాంతారావ్ (రామచంద్రపురం), ఓర్సు ఆదాము (నూజివీడు), కె.బాబూరావ్ (తక్కెళ్లపాడు), పి.షద్రక్ (గన్నవరం), జాషువా గూటం గార్లు అనేక చారిత్రక, లేఖన పూర్వక వాస్తవములను చూపించుచు ఈ లోకానికి దేవుడే తన కుమారుని క్రీస్తు రూపంలో పంపిన విధానమును వివరించిరి. ముత్యాలంపాడులో సోదరులు పి.అబ్రాహాము గారు క్రీస్తు కొరకై గొప్ప కృషి చేయుచున్నారు. స్థానిక సంఘము వచ్చిన వారందరికీ మంచి విందునేర్పాటు చేసిరి. సోదరులు జి.సామ్యేలు(వుడ్‌పేట) గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను.

మార్చి 16వ తేదీ సాయంత్రం విజయవాడ మధురానగర్‌లో నిర్మించ బడిన క్రీస్తు సంఘ ప్రార్థనశాలను జాషువా గారు రిబ్బను కత్తిరించి ప్రారంభించిరి. మధురానగర్‌లో సోదరులు కె.సాల్మన్ గారు పి. అబ్రాహాము గారితో కలిసి సువార్త పని చేయుచున్నారు.

మార్చి 24వ తేదీ శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నెహ్రూ కోలనీలో ఉభయగోదావరి జిల్లాల సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. నెహ్రూ కోలనీలో సోదరులు బొందా జోషీరావ్ గారు చాల కాలమునుండి అనేక ఇబ్బందుల కోర్చి నమ్మకముగా క్రీస్తు సువార్తను చాటుచున్నారు. ఆ సదస్సులో "క్రీస్తు సంఘమునకును మతశాఖలకును గల వ్యత్యాస మేమి?" యను అంశము చర్చించబడెను. సోదరులు యన్.రవికుమార్, కె.ప్రసాద్, మరియు

బీర రాజు గార్లు పాటలు నడిపించిరి. పెనుమంచిలి నుండి వచ్చిన యమ్.జోసఫ్ గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభమాయెను. ఇయ్యబడిన అంశమును సోదరులు బూల యోహాను (పల్లంకుర్రు), జి.షద్రక్ (పాలకొల్లు), కె.నీలకంఠశర్మ (పుల్లేటికుర్రు), యన్.ఏలియా (దేవగుప్తం), బుర్రే యోహాను (కురెళ్లగూడెం), డి.రంగారావ్ (గొల్లవిల్లి), మరియు గొల్ల రాజారావ్ గార్లు సవిస్తరముగా చర్చించిరి. దైవ వేదమునుండి క్రీస్తు సంఘము యొక్క అనేక సత్య లక్షణములను వెలికితీసి చూపించిరి. మతశాఖలు లేఖన విరుద్ధములని, వాటిలో సభ్యులై యుండుట ఆత్మీయముగా ప్రమాదమని హెచ్చరించిరి. నెహ్రూకోలనీలో యున్న క్రీస్తు సంఘము అత్యంత ఆసక్తితో ఏర్పాట్లు చేసి వచ్చిన వారందరికీ మంచి భోజన పానాదుల నేర్పరచిరి. సోదరులు కుసుమ ఐజక్ (మాకన పాలెం) గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను. వచ్చిన వారందరికీ జోషీరావ్ గారు వందన సమర్పణ చేసిరి, వారి ప్రార్థనల నభ్యర్థించిరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam